ప్రజాశక్తి

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పిపిపి దిశగా కేంద్ర మధ్యంతర బడ్జెట్

- రక్షణ రంగానికి పెద్దపీట
- పోర్టుల కనెక్టివిటీ, వ్యవసాయం, సాధారణ రైళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలపై మారని విధానం
- భారీగానే ధరల పెరుగుదల
- ఆహార ద్రవ్యోల్బణానికి దిక్సూచిగా 2024-25 బడ్జెట్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2024-25 కేంద్ర మధ్యంతర బడ్జెట్ దేశం, రాష్ట్రాల్లోని పలు రంగాలను దివాలా తీసేలాగ ముఖ్యంగా రైల్వేలు, పోర్టులు, వ్యవసాయాన్ని పిపిపివైపు నడిపించే దిశగా ఉంది. రక్షణ శాఖకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. గత బడ్జెట్ కంటే 4.72శాతం అదనంగా కేటాయింపులు చేసి రూ.6.21లక్షల కోట్లను రక్షణ రంగానికి కేటయించగా, వ్యవసాయ రంగంలో పోస్ట్ హార్వెస్టింగ్ అంతా పిపిపికి అప్పగించారు. సాధారణ పాసింజర్ రైళ్లను తగ్గించేసి వాటి స్థానంలో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టే దిశగా బడ్జెట్ ప్రతిపాదనలున్నాయి. వైజాగ్ పోర్టు కనెక్టివిటీ కోసం రూ.వందల కోట్ల ప్రతిపాదనలు పంపగా అవన్నీ పిపిపిలో జరగాలని, దేశంలో 12 మేజర్ పోర్టుల్లో కనెక్విటీ, ఇంటర్‌లింకింగ్ అంతా పిపిపికే అప్పగించేలాగ కేంద్ర బడ్జెట్ దారిచూపింది. వైజాగ్ పోర్టులో 24 బెర్తులకుగానూ ఇప్పటికే 12కు పైగా పిపిపిలోకి వెళ్లిపోయాయి. ఈ బడ్జెట్ అనంతరం మరింత సులువుగా పిపిలోకి మిగతా బెర్తులు వెళ్లనున్నాయి. ఇప్పటికే వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రంలోని బిజెపి నిర్ధాక్షిణ్యంగా ఎత్తేయడంతో కొత్త రైళ్లు లేకుండా పోయాయి. సుమారు రూ.9వేల కోట్ల ఏటా ఆదాయాన్నంతటినీ కేంద్రం తీసుకుపోతుంది. వందేభారత్ రైళ్ల పేరుతో ప్రయాణికులపై అధిక ఛార్జీల భారం వేసేందుకు సిద్ధమైంది. రైల్వే జోన్ ప్రకటించి కూడా కనీసం ఈ బడ్జెట్‌లో దాని ప్రస్తావన చేయలేదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని కేంద్రం ప్రకటించి మూడేళ్లు దాటుతున్నా కార్మికులు, ప్రజలు పోరాటాలతో దీన్ని ఆపినా సరే ప్రైవేటీకరణ విధానం నుంచి కేంద్రం వెనక్కి తగ్గకపోవడం, ఈ బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్ల ప్రస్తావన లేకపోవడం అత్యంత హేయమైనదిగా ఉంది. కార్లు, వాహనాల విషయానికొస్తే లగ్జరీ కార్లను వినియోగించే ఎగువ మధ్యతరగతి వారికి ఊరట కలిగించేలా ధరలున్నాయి. సాధారణ, మధ్యతరగతి కొనుక్కొనే మామూలు కార్లు, వాహనాల విషయంలో అధిక ధరలు, పన్నులు వేసే దిశగా బడ్జెట్ ఉండడంతో సామాన్యులు వాహనాలను కొనుక్కునే పరిస్థితి కరువవ్వనుంది. ఇప్పటికే దేశమంతటా బిజెపి అధికారంలోకి వచ్చిన 2014 నుంచి ఇప్పటివరకూ ఆహార ధాన్యాలు, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా అదుపు చేసే బడ్జెట్ ఒక్కటంటే ఒక్కటీ లేదు. ప్రస్తుతం వెల్లుల్లి ధర విశాఖ మార్కెట్‌లో కిలో రూ.520ను తాకింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇదే ధర ఉంది. ఈ బడ్జెట్ ధరల పెంపును ప్రోత్సహించేలా ఉందన్నది స్పష్టమవుతోంది. ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం దేశంలో విలయతాండవం చేస్తుందని, దేశంలోని గోదాముల్లో బియ్యం, గోధుమ నిల్వలు పేరుకుపోతున్నా సామాన్య జనానికి కేంద్రం ఇవ్వడం లేదని గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఎలాంటి పునరాలోచనా కేంద్ర ఇంటరిమ్ బడ్జెట్

మిగతా 2లో..

మరోసారి వంచన

బడ్జెట్‌పై సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు జగ్గునాయుడు, లోకనాథం

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ నిస్పృహలకు గురిచేసిందని, ఆంధ్రప్రదేశ్ మరోసారి వంచనకు గురైందని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం పేర్కొన్నారు. మన రాష్ట్రానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్లో లేవన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గానీ, పోలవరం నిర్వాసితుల విషయం గానీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన తదితర ఏ అంశాలు ఈ బడ్జెట్ లో లేకపోవడం మరొకసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలను వంచించటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జిఎస్‌టి వసూళ్లు పెరిగినా, రాష్ట్రం వాటా మాత్రం పెరగలేదన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు, వైసిపి, టిడిపి, జనసేన సహా అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు. కేంద్ర బడ్జెట్ గత 10 ఏళ్లు విషాదంగానే ఉందన్నారు. ఈ బడ్జెట్ లో 99 శాతం ప్రజలకు ఎలాంటి ఉపశమనం లేదని తెలిపారు. బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలిందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వ రంగ ఆస్తులన్నీ అంబానీ, అదాని లాంటి బడాకార్పొరేట్‌లకు కట్టబెట్టడానికే మోడీ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చిందని విమర్శించారు. నిరుద్యోగులకు తీవ్రంగా అన్యాయం జరిగిందన్నారు. ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రత్యక్ష పన్ను రాయితీలన్నీ కార్పొరేట్ కంపెనీలకి ఇచ్చి పెంపుదల భారం అంతా మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి, ఉద్యోగవర్గాలపై వేశారని తెలిపారు. సామాన్య, పేద ప్రజల సాధారణ పాసింజర్ రైళ్లను భవిష్యత్తులో పూర్తిగా తొలగించి వాటి స్థానంలో వందేభారత్‌ను తీసుకొచ్చి రైళ్ల ప్రయాణం నుంచి సామాన్యులను, పేదలను దూరం చేయనున్నారని ఈ బడ్జెట్ ద్వారా అర్ధమౌతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న 'ఉపాధి హామీ'కిఈ బడ్జెట్‌లో కేవలం రూ.86వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. దీన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నంలో ఉన్నారని విమర్శించారు. వ్యవసాయ రంగం, విద్య, ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, ఎస్సీ, ఎస్టీలు, ఇతర పథకాలకు కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. మహిళలు, పిల్లల పథకాలకు నిధులు తగ్గించారని, ఎరువులు, ఆహార సబ్సిడీలను కుదించారని తెలిపారు. అసంతృప్తిని పక్కదారి

మిగతా 2లో..

విశాఖ ఉక్కు జోలికొస్తే సహించం

వార్త 2లో..

'సెంచూరియన్'తో బిఎస్ఎన్ఎల్ ఎంఒయు

వార్త 2లో..

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

వార్త 8లో..

జివిఎంసిలో 18 మందికి టాక్స్ కలెక్టర్లుగా ప్రమోషన్

వార్త 2లో..

'ఆడుదాం-ఆంధ్ర' రాష్ట్ర స్థాయి క్రీడలను విజయవంతం చేయాలి : జెసి



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర స్థాయి క్రీడలను విజయవంతం చేయాలన్నారు. ఈ పోటీల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గురువారం ఆయన ఛాంబరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం బస్సు, రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని చెప్పారు. బస్సు, రైల్వే స్టేషన్ల నుంచి క్రీడాకారులు వసతి గృహానికి, క్రీడా ప్రాంగణానికి రాక, పోకలు సాగించేలా రవాణా సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పురుష క్రీడాకారులకు కేటాయించే వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వసతి గృహం వద్ద పోలీసు బందోబస్తును ఉంచాలన్నారు. నాణ్యమైన అల్పాహారం, భోజనాన్ని క్రీడాకారులకు అందించాలని చెప్పారు. ఒక్కో క్రీడకు ఒక నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షించాలని ఆదేశించారు. క్రీడా మైదానాలను పరిశీలించి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌డిఒ జాన్ గేలియట్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి భారత్- ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్

ప్రజాశక్తి-పిఎం.పాలెం : భారత్ -ఇంగ్లాండ్ రెండో టెస్టు మ్యాచ్ శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. శుక్రవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న టెస్టు మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో భారీ భద్రతా ఏర్పాట్లుచేసింది.

పార్కింగ్ ప్రాంతాలు

ప్రేక్షకులు తమ వాహనాలను కల్యాణ్‌కుమార్ పార్కింగ్ లేఅవుట్, 'బి' గ్రౌండ్‌లో ప్రత్యేకంగా పార్కింగ్‌కు ఏర్పాట్లుచేశారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేదు.

మ్యాచ్ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. ప్రేక్షకులను ఉదయం 8 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు.

ప్రాక్టీసుతో క్రికెటర్ల సందడి

పీఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం భారత్, ఇంగ్లాండ్ జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ చేశారు. ఉదయం భారత్ జట్టు క్రీడాకారులు, మధ్యాహ్నం ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు ప్రాక్టీస్ చేశారు.



నెట్ ప్రాక్టీస్ చేస్తున్న భారత ఆటగాళ్లు

మొదటి పేజీ తరువాయి..

పిపిపి దిశగా కేంద్ర మధ్యంతర బడ్జెట్

చేయలేదు.

యువతకు మళ్లీ మోసం...

1.4 కోట్ల మంది యువతకు స్కిల్ ఇండియా మిషన్ కింద ట్రైనింగ్ అన్నారు. ముద్ర రుణాలు రూ.కోట్లల్లో ఇస్తున్నామని చెబుతున్నా ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు. విశాఖ జిల్లాలో ముద్ర రుణాల కోసం 12వేల దరఖాస్తులు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్కిల్ ఇండియాకు కోటి 40లక్షల మందికి ట్రైనింగ్ అంటూ ఈ బడ్జెట్‌లో చెప్పినా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని 2019లో అధికారంలోకి వచ్చిన కేంద్రం ఇంతవరకూ అమలు చేయకపోగా 2024 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్కిల్ ఇండియా మిషన్‌ను ఈ బడ్జెట్‌లో తెరపైకి తేవడం యువతకు గాలం వేయడం తప్ప మరొకటి కాదు. విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఏటా డిగ్రీలు, పీజీలు పూర్తిచేసుకుని బయటకొస్తున్న వారి సంఖ్య సుమారు 30వేల మంది వరకూ ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే వారి సంఖ్య ఉపాధి కల్పనా కార్యాలయ అధికారుల లెక్కల ప్రకారం 1.2శాతం కంటే ఎక్కువ లేదు. మొత్తంగా ఈ బడ్జెట్ సంపన్నులు, కార్పొరేట్లకు మినహా సామాన్యులకు ఎంత మాత్రం ఉపయోగం లేని బడ్జెట్ అన్న చర్చ సర్వత్రా సాగుతోంది. 2024 ఎన్నికల తర్వాత జూన్ లేదా జులైలో పూర్తిస్థాయిలో వచ్చే కేంద్ర బడ్జెట్ కూడా ఇంతకంటే గొప్పగా ఏమీ ఉండదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

మరోసారి వంచన

పట్టించడానికి, అణచటానికి మతాన్ని అడ్డంగా ఉపయోగించుకొని రామనామస్మరణతో ప్రజల్ని మాయచేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

విద్యా సంస్థలకు పర్యావరణ కేలండర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విద్యా సంస్థలన్నింటికీ పర్యావరణ కేలండర్‌ను అందజేస్తున్నామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో కార్యదర్శి జెవి.రత్నం పేర్కొన్నారు. ఎన్‌విపి డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థీ పర్యావరణహితంగా జీవించాలనే లక్ష్యంతో ఈ కేలండర్‌ను ఏటా ముద్రించి పంచుతున్నామని తెలిపారు. మనిషి తప్ప ప్రతి జీవీ పర్యావరణహితంగా జీవిస్తున్నాయన్నారు ఈ కార్యక్రమంలో ఎన్‌విపి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విద్యార్థులు బి.భరద్వాజ్ కుమార్, నాని, సిహెచ్.రాజేశ్వరి, బి.యామిని తదితరులు మాట్లాడారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 36వ వార్డు పరిధిలో రూ.68 లక్షలతో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేటర్ మేరీ జోన్స్ ఆధ్వర్యాన మేయర్ సారథ్యంలో విడుదలైన జివిఎంసి నిధులు రూ.31.80 లక్షలతో ఎవిఎన్ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వీధి వరకు బిటి రోడ్డు నిర్మాణం, 36వ వార్డు మంతావారి వీధిలో రూ.21.90 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పనులు ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన రెల్లివీధి పోలమాంబ ఆలయం వద్ద కమ్యూనిటీ భవనం ప్రారంభించామని చెప్పారు.

కార్మిక శాఖ వద్ద దుకాణాలను నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని అన్ని దుకాణాలను కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ జోన్-1 సంయుక్త కమిషనర్ ఆదూరి గణేషన్ తెలిపారు. ఈసరికే నమోదు కాపడ్డ దుకాణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. మీ-సేవ, గ్రామ, వార్డు సచివాలయాలలో మాత్రమే ఈ నెల 29వ తేదీ లోగా నమోదు, రెన్యువల్ చేయించుకోవాలని యజమానులకు సూచించారు.

ఘనంగా ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాసరావు జయంతిని వన్ టౌన్‌లోని స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యాన, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవత్స నేతృత్వంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ముందుగా ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి వివేకానంద సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, వుడా మాజీ చైర్మన్ పిఎస్ఎన్.రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రోణంరాజు శ్రీనివాస్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు.

మేయర్‌ను కలిసిన అదనపు కమిషనర్ విశ్వనాథన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కెవిఎన్.విశ్వనాథన్ మర్యాదపూర్వకంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో కలిశారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నగరానికి ఎన్నో సేవలు అందించి జివిఎంసి అదనపు కమిషనర్‌గా వచ్చిన విశ్వనాథన్‌ను మేయర్ అభినందిస్తూ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

విశాఖ ఉక్కు జోలికొస్తే సహించం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 1085వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్ఎండి విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెట్టడమే కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని విమర్శించారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో సమర్థించుకోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుపై కన్ను పడినందుకే అదానీ పతనం ప్రారంభమైందన్నారు. ఈ దేశంలో మోడీకి అండగా నిలిచిన రాజకీయ పార్టీలు అధోగతి పాలుకాక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగా ఉత్పత్తిని తగ్గించి, కొన్ని విభాగాలను మూసివేసి నష్టాల వైపు నడుపుతున్నారని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ, ప్రమోషన్లు కల్పించకుండా అనేక అవరోధాలు కల్పిస్తూ పారిశ్రామిక అనిశ్చితికి కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా నడిపించాలని, గనులు కేటాయించాలని, విస్తరణ కోసం చేసిన అప్పులను మాఫీ చేయాలని, రెండేళ్లుగా నిలిపివేసిన ఉద్యోగ నియామకాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. ఈ దీక్షా శిబిరంలో నాయకులు డి.హరినాథ్, ఎస్.ఈశ్వరరావు, పి.అప్పారావు ఆర్.శ్రీనివాసరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ యూనివర్సిటీతో బిఎస్ఎన్ఎల్ ఎంఒయు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు సెంచూరియన్ యూనివర్సిటీతో బిఎస్ఎన్ఎల్ గురువారం ఎంఒయు కుదుర్చుకుంది. ఈ మేరకు బిఎస్ఎన్ఎల్ తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.పల్లవి సంతకాలు వచ్చేసి, ఎంఒయు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ డిజిఎం డాక్టర్ ఎం.సత్య ప్రసాద్ మాట్లాడుతూ, వివిధ స్పెషలైజేషన్స్ సిఎస్‌సి నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులు, ఈసిఈ, ఐటి, ఈఈఈ విద్యార్థులు విశాఖపట్నంలోని బిఎస్ఎన్ఎల్ ట్రైనింగ్ పాయింట్‌లో ఉన్న సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు వినియోగించుకుంటారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బిఎస్ఎన్ఎల్‌తో ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ పనిచేస్తుందన్నారు. అంతరాన్ని తగ్గించడానికి విద్యార్థుల ప్రోగ్రాంతో పాటు అధ్యాపకుల శిక్షణా కార్యక్రమం కూడా విస్తరింపబడుతుందన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారడానికి మార్గం సుగమం చేసి అన్ని విభాగాలలో సాంకేతిక పత్రాలను సమర్పించడానికి ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బిఎస్ఎన్ఎల్ ను ఆయన అభ్యర్థించారు. ఆయన అభ్యర్థన మేరకు ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు బిఎస్ఎన్ఎల్ అంగీకరించింది. బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.పాల్ విలియం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.తిరుపతినాయుడు, సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ పిఎ సన్నిదయాల్, డాక్టర్ మురళి పాల్గొన్నారు.

పూర్ణా మార్కెట్ రోడ్లను ఖాళీ చేయించిన పోలీసులు



ట్రాఫిక్ క్లియర్‌గా ఉన్న పూర్ణామార్కెట్ రోడ్డు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ ప్రవేశ మార్గం ప్రాంతంలో నిత్యం రోడ్డు పక్కన తోపుడుబళ్లు, జంగిడీలతో వ్యాపారం చేసుకుంటూ, ట్రాఫిక్‌కు అవరోధం కల్పిస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. కనీసం సైకిల్ కూడా వెళ్లలేని విధంగా రోడ్లను ఆక్రమించుకోవడంపై గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇన్నాళ్లూ చోద్యం చూస్తున్న జివిఎంసి కూడా పోలీసుల చర్యలను సమర్థించింది. రోడ్డు ఆక్రమణల కారణంగా, ఇక్కడ పార్కింగ్ సౌకర్యం కూడా ఉండేది కాదు. మార్కెట్‌కు వచ్చే జనం ఇబ్బందిపడేవారు. అక్కడున్న కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారం చిరువ్యాపారులకు అనుమతిచ్చేసి వారి నుంచి డబ్బులు వసూలు చేసుకునే వారు. చాలా కాలంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై పోలీసులు జులుం ప్రదర్శించారు. వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ విశ్వనాథ్, హార్బర్ ట్రాఫిక్ సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యాన వివిధ విభాగాల సిబ్బంది రోడ్లను ఖాళీ చేయించడంతో శాశ్వతంగా దుకాణాలేర్పాటు చేసుకున్న వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగానే ఈ స్పెషల్ డ్రైవ్‌ను పోలీసులు చేపట్టారు.

డాల్ఫిన్ హిల్స్ పరిశీలన

ప్రజాశక్తి- విశాఖపట్నం : విశాఖ నగరంలో మిలాన్ 2024 కార్యక్రమాల నేపథ్యంలో యారాడ ప్రాంతంలోని డాల్ఫిన్ హిల్స్, యారాడ బీచ్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి అదనపు కమిషనర్ కెవిఎన్.విశ్వనాథన్, నేవెల్ కమాండర్ సివిల్ మిలిటరీ లైసెన్ ఆఫీసర్ కిషోర్‌తో కలిసి యారాడ ప్రాంతంలో డాల్ఫిన్ హిల్స్ వై జంక్షన్, లైట్‌హౌస్, డాల్ఫిన్ కోవ్ పాయింటు నుంచి బీచ్ వరకు మెట్ల మార్గం, బీచ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిలాన్ 2024 సందర్భంగా 50 దేశాల ప్రతినిధులు, అతిథులు, నేవెల్ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన నున్నందున యారాడలో గల డాల్ఫిన్ హిల్స్ నుండి యారాడ బీచ్ వరకు హెల్త్ ట్రెక్, యోగా, అతిథులకు ఆతిథ్యం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రదేశాలలో పారిశుధ్యం నిర్వహణ చేపట్టి త్వరితంగా పూర్తి చేయాలని జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌ను ఆదేశించారు.

రియల్‌మీ 12 ప్రో సిరీస్ 5జీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ ఫోన్ బ్రాండ్ రియల్‌మీ 12 ప్రో సిరీస్ 5జీని నగరంలోని ఒక హోటల్లో ఆవిష్కరించింది. రెండు స్మార్ట్ ఫోన్‌లను పరిచయం చేసింది. ఈ సందర్భంగా రియల్‌మీ డాల్ఫీ లేబొరేటరీస్, మార్కెటింగ్ డైరెక్టర్ సమీర్ సేథ్ మాట్లాడుతూ, ఈ ఆవిష్కరణ రియల్‌మీ 'మేక్ ఇట్ రియల్' బ్రాండ్ స్ఫూర్తితో వైలురాయిని సూచిస్తుందన్నారు. రియల్‌మీ 12 ప్రో ప్లస్ 5జీ తదుపరి తరం ఇమేజింగ్ సాంకేతికతను పరిచయం చేస్తుందన్నారు. యువ వినియోగదారుల కోసం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీని ఎలివేట్ చేయడానికి రూపొందించినట్లు చెప్పారు.



శిల్పకు డాక్టరేట్‌ను అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

బమ్మిడి శిల్పకు డాక్టరేట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 'ఉన్నత విద్యలో మానవ వనరుల అభివృద్ధి-విశాఖపట్నంలోని ప్రైవేట్ సెక్టార్‌లో డిగ్రీ కళాశాలను ఎంచుకోవడానికి సూచనతో కూడిన అధ్యయనం' అంశంపై పరిశోధనకు గాను బమ్మిడి శిల్పకు డాక్టరేట్‌ను ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అందించారు. ఈ సందర్భంగా శిల్పను ఆదిత్య సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, తోటి పరిశోధకులు, స్నేహితులు అభినందించారు.

వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ప్రజా దర్బారులో అర్జీలు పెట్టుకున్న వారికి రూ.5 వేలు చొప్పున పదిమందికి రూ.51,500 గురువారం నేరుగా వారి ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే గణేష్ కుమార్ అందజేశారు. ఈ పర్యటనలో వివిధ వార్డుల్లో వృద్ధులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆప్యాయంగా పలకరించి రూ.500 చొప్పున ముగ్గురికి రూ.1500 ఇచ్చారు.

గృహ నిర్మాణ శాఖ జిల్లా మేనేజర్‌గా మేరీగ్రేస్

ప్రజాశక్తి-విశాఖపట్నం : గృహ నిర్మాణ శాఖ విశాఖపట్నం జిల్లా మేనేజర్‌గా మేరీగ్రేస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతవరకు శ్రీకాకుళం జిల్లా హౌసింగ్ మేనేజర్‌గా పనిచేశారు. బదిలీపై విశాఖపట్నం జిల్లాకువచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం హౌసింగ్ పీడీ దేవరకొండ అఖిలను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

18 మందికి టాక్స్ కలెక్టర్లుగా ప్రమోషన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆఫీస్ సబార్డినేటర్లు, పిహెచ్ వర్కర్లు, నాన్ పిహెచ్ వర్కర్లు 18 మందికి టాక్స్ కలెక్టర్లుగా ప్రమోషన్ కల్పిస్తూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు మేయర్ వారికి ఉత్తర్వులను అందించారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక: నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలన్నీ దాదాపు పరిష్కరించానని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గురువారం జివిఎంసి 87వ వార్డులో రూ.49.70లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురం కాలనీలో రూ.19.80 లక్షలతో సిసిరోడ్లు, డ్రైనేజీలు, తారకరామా నగర్‌లో రూ.10 లక్షలతో సిసిరోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, తిరుమలనగర్‌లో రూ.19.90 లక్షలతో బిటిరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో గాజువాక జెడ్‌సి పొందూరు సింహాచలం, వైసిపి సమన్వయకర్త ఉరుకూటి చందు, వార్డు ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొడ్డ గోవిందా, రామచంద్ర రాజు ,జిల్లా కార్యదర్శి ప్రగడవేణుబాబు, వార్డు కార్యదర్శి ముద్దపు దామోదర్, సచివాలయ కన్వీనర్ దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, సిహెచ్‌వి రమణ, బోండా గోవిందరాజులు, ప్రగడ శ్రీనివాస్, ఎస్.పాపారావు, ఆడారి శ్రీను, కోమటి రమాదేవి పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నర్సింగ్ విద్యార్థులకు వృత్తిపరమైన అంశాలపై గురువారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డాక్టర్ సి.రాకేష్ ఇన్‌స్ట్రక్టర్‌గా 13 నర్సింగ్ కళాశాలలకు చెందిన నర్సింగ్ విద్యార్థులకు బిసిఎల్‌ఎస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈనెల12 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు ఎన్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పివి సుధాకర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీబా ఫ్రాన్సిస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి శివప్రసాద్ పాల్గొన్నారు

బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి ఎనిమిదో జోన్ పరిధిలోని బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. వేపగుంటలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్‌వి రామరాజు, ఉపాధ్యక్షునిగా పి.హరిప్రసాద్, ఎన్.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా ఎల్.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా సతీష్, ట్రెజరర్‌గా ఎల్. రమణారెడ్డి, సభ్యులుగా డివి.రమణ, డి.రాజశేఖర్, చిన్నారావు, ఆదిత్య శేఖర్, ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా అజిత్‌కుమార్,రామయ్య చౌదరిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ, కోవిడ్ నుంచి నేటివరకు బిల్డర్స్ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ, నేటికీ కోలుకోని స్థితి ఉందన్నారు .సభ్యులంతా ఐక్యంగా ఉండి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికత మార్పిడిలో

హిందీభాష ప్రాముఖ్యత ఎనలేనిది

- ఎన్‌ఎస్‌టిఎల్‌లో సంయుక్త రాజ్యభాష సైంటిఫిక్, టెక్నికల్ సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కరాస/ఎంవిపి కాలనీ : దేశంలో సంక్లిష్టమైన శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంలో రాజ్యభాష హిందీ ఎంతో కీలకం, ప్రాముఖ్యమైనదని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డిఆర్‌డిఒ విశిష్ట శాస్త్రవేత్త, డిజి డాక్టర్ వై శ్రీనివాసరావు అన్నారు. డిఆర్‌డిఒ హైదరాబాద్ క్లస్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌ఎస్‌టిఎల్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న మూడో అఖిల భారత సంయుక్త రాజ్‌భాష సైంటిఫిక్ అండ్ టెక్నికల్ సెమినార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ, మాతృభూమికి సేవ చేయాలంటే శాస్త్రీయ సమాజానికి సేవ చేయాలన్నారు. దేశం మొత్తాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు హిందీభాష ఎంతో ముఖ్యమైనదన్నారు. హిందీ టెక్నికల్ సెమినార్ నిర్వహించిన ఎన్‌ఎస్‌టిఎల్‌ను అభినందించారు. ఐఎస్ఎఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.జె.నివారే మాట్లాడుతూ సరిహద్దులును సురక్షితం చేయడంలో డిఆర్‌డిఒ పాత్రను, సాంకేతికతలను ప్రశంసించారు. ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారతనౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధి చేయడంలో ఎన్‌ఎస్‌టిఎల్ పాత్రను వివరించారు.సెమినార్‌కు వచ్చిన ప్రతినిధులను ఆహ్వానించారు. సెమినార్‌లో డిఆర్‌డిఒ డైరెక్టర్ (రాజ్‌భాష) డాక్టర్ రవీంద్రసింగ్, ఎన్‌ఎస్‌టిఎల్ సైంటిస్ట్-జి, సెమినార్ ఛైర్మన్ సి.కేదార్‌నాథ్, సైంటిస్ట్-ఎఫ్ ,సెమినార్ కోఆర్డినేటర్ వివేక్ శర్మ పాల్గొన్నారు.

బాబు వస్తే వైసిపి బాగోతం బట్టబయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- ములగాడ : ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి నేతల బండారం, బాగోతం బట్టబయలు అవుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గురువారం జివిఎంసి 60వ వార్డు అశోక్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాలు, అవినీతి, అక్రమాలన్నింటినీ వెలుగులోకి తెస్తామన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోని వచ్చిన సిఎం జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ, రాష్ట్రాభివృద్ధిని ఇరవై ఏళ్ల వెనక్కు వెళ్లేలా చేశారన్నారు. మాటిచ్చి తప్పిన సిఎం జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు నక్క లక్ష్మణరావు, రాము, మాతా .శ్రీనివాసరావు, నీలాపు జోజి, జయశంకర్ పాల్గొన్నారు

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస :స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల, ఇసిఇ విభాగంలో రోబో కాప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన నిర్వహించిన రెండ్రోజుల వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. మైక్రో కంట్రోలర్, దాని నిర్మాణం, ప్రోగ్రామింగ్ మోడల్‌పై రోబో కాప్లర్ సంస్థ సిఇఒప్రవీణ్ మల్లా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ ఎంబెడెడ్ ఇంజనీర్ హరచంద్ర, హార్డ్‌వేర్‌పై కోడ్‌ను ప్లాషింగ్ చేయడం, ఎల్‌ఇడి, బజర్, డిసి మోటార్, పుష్ బటన్ స్విచ్‌లు వంటి మ్యాడ్యూల్స్‌ను ఇంటర్ ఫేస్ చేయడం, ఆర్డినోలో కోడింగ్ భావనల గురించి వివరించారు. వైఫై ఉపయోగించి రోబోను నియంత్రిస్తూ యాప్ డెవలప్‌మెంట్ డొమైన్‌లోకి అడుగుపెట్టవచ్చని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎ అర్జున్, ఎలక్ట్రానిక్ విభాగాధిపతి వి శివ భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు

సిఐకి అభినందన

ప్రజాశక్తి- గాజువాక : న్యూపోర్ట్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన దాలిబాబును పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సిఐని కలిసిన వారిలో జెఎస్ ఫర్ పీపుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జాగారపు శ్రీను, గంధం సాయి, ఎఎన్‌ఆర్ హెల్పింగ్ సంస్థ ఫౌండర్ రాఘవరెడ్డి, హెల్పింగ్ హాండ్స్ సంస్త వ్యవస్థాపకుడు ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, కరణం బాబురావు, మొల్లి శ్రీను, గ్రాండ్వల్ ప్రసాద్ ,బోడ్డేపల్లి సంతోష్, బాల ఉన్నారు.

అప్పన్నను దర్శించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఈస్ట్‌కోస్ట్ రైల్వే, భువనేశ్వర్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు

పర్యాటకాభివృద్ధి ముసుగులో దోపిడి : పీతల

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పి, పర్యాటకం ముసుగులో దోపిడీకి వైసిపి సర్కార్ శ్రీకారం చుట్టిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మండిపడ్డారు. గురువారం పౌరగ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎపి టూరిజం మంత్రి రోజా, ఎండీలందరూ అవినీతిలో కూరుకుపోయారని, రూ.వెయ్యికోట్ల ఆస్తిని ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రుషికొండను బోడి గుండును చేశారని, ఇపుడు కైలాసగిరిని, వాటర్ స్పోర్ట్స్ పేరుతో తాటిపూడి రిజర్వాయర్‌ను, వుడా పార్కులోని ఏడెకరాల భూములను ప్రయివేటుకు లీజ్‌కు కట్టబెట్టాలని ప్రణాళికలు చేస్తున్నారన్నారు. పర్యాటకప్రాంతం అరుకును రూ.150 కోట్లకు పిపిపి పద్ధతిలో లీజుకిచ్చేందుకువైసిపి సర్కార్ హడావిడి చేస్తోందని ఆరోపించారు

నేరాలు ఘోరాలు

గ్రామ వాలంటీర్ దారుణహత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో హరి

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని లచ్చన్న పాలెం గ్రామానికి చెందిన వాలంటీర్ నడింపల్లి హరి(24) దారుణహత్యకు గురయ్యాడు. గ్రామ శివారులోని పంట పొలాల్లో హరి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నర్సీపట్నం రూరల్, టౌన్ సిఐలు హరి, నమ్మి గణేష్, స్థానిక ఎస్సై రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ముఖంపై బలమైన గాయాలు కావడంతో హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసుపై పూర్తి సమచారం తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రజాశక్తి -మధురవాడ: జాతీయ రహదారిలో పరదేశి పాలెం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ప్రకారం, పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై పరదేశీపాలెం వద్ద సుమారు 45ఏళ్ల కలిగిన వ్యక్తి రోడ్డు దాటుతుండగా , ఆనందపురం వైపు నుంచి మధురవాడ వైపు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని బంధువులు ఉంటే పిఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

రెండు పొట్టేళ్ల చోరీ

ప్రజాశక్తి -ఆనందపురం : చోరీలకు ఏదీ అనర్హం కాదన్నట్లుగా దొంగలు వ్యవహరిస్తున్నారు. మండలంలోని బోని రోడ్డులో చందక వెంకటరమణకు చెందిన రెండు గొర్రె పోతులను బుధవారం రాత్రి దొంగలించుకుపోయారు. ఇంటి వద్ద గదిలో రెండు పొట్టేళ్లను పెట్టి, గదికి తాళాలు వేసినప్పటికీ, గుర్తు తెలియని దొంగలు కారు, బైక్‌లపై వచ్చి, గదితాళాలను పగలగొట్టి, పొట్టేళ్లను ఎత్తుకుపోయారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వీటి విలువు రూ.26వేలు ఉంటుందన్నాడు. దీనిపై ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటనాస్థలికి సందర్శించిన పోలీసులు, సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

భాష్యంలో ఘనంగా స్పోర్ట్స్ డే



ప్రశంసాపత్రాలతో విజేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు రవినగర్ భాష్యం పాఠశాలలో గురువారం స్పోర్ట్స్‌డే మీట్‌ను నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాఘవరావు మాట్లాడుతూ ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా పిల్లల్లో క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం పెరుగుతుందన్నారు క్రీడల్లో రాణిస్తే పేరు ప్రఖ్యాతులతోపాటు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్ కుమారి, వైస్ ప్రిన్సిపల్ శ్రీను ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసును అందజేస్తున్న సిఐటియు, ఐఎన్‌టియుసి నేతలు

ప్రజాశక్తి -గాజువాక: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, రాష్ట్రస్థాయి కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 16న సమ్మె చేపట్టనున్నట్లు భెల్ హెచ్‌పివిపి యూనిట్ సిఐటియు, ఐఎన్‌టియుసి నేతలు వెల్లడించారు. గురువారం సంస్థ హెచ్‌ఆర్ హెడ్ ఎంవిఎస్ఎన్ రాజుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా, స్థానిక సమస్యలు, దేశవ్యాప్త సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో వి బాబురావు, జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, సిహెచ్ఎస్‌వి.నారాయణ, జి.అచ్చెన్నాయుడు ఉన్నారు.

సమస్యలపై భోజన కార్మికుల వినతి



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న భోజన కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. గురువారం ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగ, ఇతర నేతలు మాట్లాడుతూ, భోజన కార్మికుల వేతనాన్ని రూ.పది వేలకు పెంచాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు, వేతనాలతోపాటు ఇతర బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలను ఒక్కొక్క విద్యార్థికి రూ.20 చొప్పు పెంచాలని కోరారు. ఎన్నికల ముందుకు తమకిచ్చిన హామీలను సిఎం జగన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలువెంకటలక్ష్మి, రాధిక, ధన రవణమ్మ చిట్టెమ్మ పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత జగన్‌దే



ఆసరా చెక్కు అందజేస్తున్న మేయర్, కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పాదయాత్రలో, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం బివిబి గ్రౌండ్‌లో నాలుగో విడత ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం వరుసగ నాలుగో విడత ఆసరా సాయాన్ని వైసిపి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పారదర్శంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నారన్నారు. మాట నిలబెట్టుకున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గంలోని వైసిపి కార్పొరేటర్లు, చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెటర్ భరత్‌కు ఘనసత్కారం



భరత్‌ను సత్కరిస్తున్న సిపి రవిశంకర్, ఎసిఎ ప్రతినిధులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: భారత్, ఇంగ్లండ్ రెండో టెస్ట్‌మ్యాచ్‌లో సొంతగడ్డపై తొలిమ్యాచ్ ఆడుతున్న క్రికెటర్ కోన శ్రీకర్ భరత్‌ను గురువారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ అంతర్జాతీయ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అభినందన సభలో సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ, విశాఖలోనే పుట్టి, పెరిగిన కెఎస్.భరత్, సొంతూరులో నిర్వహిస్తున్న క్రికెట్ టెస్టు మ్యాచ్‌లో భారత్ తరపున ఆడటం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌లో మంచి ప్రతిభ వల్లే భరత్ ఈ స్థాయికి చేరుకున్నారు. విశాఖ మ్యాచ్‌లో భరత్ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎసిఎ కోశాధికారి ఎవి.చలం, సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, అపెక్స్ కౌన్సిల్ మెంబర్ఎన్.గీత, విడిసిఎ కార్యదర్శి కె.పార్థసారథి, సిఎఫ్ఒ ఎం.నవీన్ కుమార్, గేమ్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్, కెఎస్ భరత్ కుటుంబసభ్యులు, కోచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి భరత్‌కు బుల్లయ్యకాలేజీ శుభాకాంక్షలు

సీతమ్మధార : నగరంలోని విసిఎ, విడిసిఎ స్టేడియంలో శుక్రవారం నుంచి జరగనున్న భారత్ ఇంగ్లాండ్ క్రికెట్ మ్యాచ్‌లో కీపర్, బ్యాట్స్‌మెన్‌గా ఆడుతున్న డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ విద్యార్థి, క్రికెటర్ కెఎస్.భరత్‌కు కాలేజీ కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. సొంతూరులో జరుగుతున్న మ్యాచ్‌లో విశేషంగా రాణించి, భారతజట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ, స్వర్ణోత్సవం జరుపుకున్న బుల్లయ్యకాలేజీ ఎంతోమంది ప్రముఖ క్రీడాకారులను తయారు చేసి, వారి ప్రగతికి ప్రోత్సహించిందన్నారు.కెఎస్.భరత్ వంటి పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని నేటితరం కష్టపడి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న లలిత్ కుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి మినీ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 2 నుంచి 4వరకు రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ లలిత్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సన్ స్కూల్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని ఒక్కో ఉమ్మడి జిల్లాల నుంచి 12మంది చొప్పున 14 ఏళ్ల లోపు బాల, బాలికలు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 312 మంది ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఒలింపిక్స్ తరహాలో రగ్బీ సెవెన్స్ ఫార్మేట్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి జిల్లా నుంచి ఆటగాళ్లతోపాటు కోచ్, మేనేజర్ పాల్గొంటా రన్నారు.

రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, ఈ పోటీలకు రగ్బీ ఇండియా నేషనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నోయల్ మాథ్యూ శ్యామ్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారన్నారు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి రామాంజనేయులు పాల్గొంటారన్నారు. రగ్బీ ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్‌ సన్ స్కూల్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు మాట్లాడుతూ విదేశాల్లో ప్రాచుర్యమున్న రగ్బీక్రీడను రాష్ట్రంలోనూ ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో భీమిలిలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారిపి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు

ఇరుకురోడ్డులో విద్యుత్ స్తంభం ఏర్పాటుపై అభ్యంతరం

ప్రజాశక్తి- వేపగుంట : ఇరుకు రోడ్డులో రాకపోకలకు ఇబ్బందికరంగా విద్యుత్‌స్తంభం వేయడంపై జివిఎంసి 93వ వార్డు దుర్గానగర్ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్త విద్యుత్‌స్తంభం మార్పు చేస్తున్న పరిస్థితుల్లో, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని స్థానికులు మొరపెట్టుకున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరించి, విద్యుత్‌స్తంభంతోపాటు దానికి సపోర్టింగ్‌గా మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

గురువారం ఆ స్తంభంపై విద్యుత్ వైర్లు బిగించేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది రాగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఎఇఇ ఆపరేషన్స్ రమణమూర్తిని వివరణ కోరగా, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సిఐఐ ప్రతినిధుల హర్షం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మధ్యంతర కేంద్ర బడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని పలు పరిశ్రమల ప్రముఖులు స్వాగతించారు. ఈ బడ్జెట్ ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం వంటి కీలక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్లో మధ్యంతర కేంద్ర బడ్జెట్ ప్రసంగం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ, గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సినేషన్‌ను లక్ష్యంగా పెట్టుకోవడాన్ని ప్రశంసించారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరోగ్య బీమా కవరేజీని పొడిగించడం ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థకు మేలు కలిగిస్తుందన్నారు. మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతోపాటు మాతా శిశు ఆరోగ్య సంరక్షణ పథకాలను క్రమబద్ధీకరించడం వంటి ప్రకటనలు ఆరోగ్యం పట్ల సంపూర్ణ నిబద్ధతను సాధించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. సిఐఐ విశాఖపట్నం వైస్ చైర్మన్ గ్రాంధి రాజేష్ మాట్లాడుతూ, ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం వ్యూహాత్మక పెట్టుబడులు, మెరుగైన పోర్ట్ కనెక్టివిటీ, అధిక-ట్రాఫిక్ డెన్సిటీ మార్గాలతో పాటు, లాజిస్టికల్ సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచడానికి, ఖర్చులను తగ్గించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రుజుల్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆర్‌విఎస్.రుద్రరాజు, విజయనగర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డి.తిరుపతి రాజు, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ డైరెక్టర్ (కమర్షియల్) డికె మొహంతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ జెడ్‌సికి ఘన సత్కారం



జెడ్‌సి రామును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : తూర్పు గోదావరి జిల్లా మండపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ బొడ్డేపల్లి రామును గురువారం ఘనంగా సత్కరించారు.స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో జెడ్‌సి రామును దుశ్శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, భీమిలి జోన్ జెడ్‌సిగా అందరూ మెచ్చే విధంగా రాము పనిచేశారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, విధులు నిర్వహించే చోట ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు , మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వరరావు, వైసిపి నాయకులు ఎస్ కరుణాకరరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, ఎస్ భాస్కరరెడ్డి, జి మధునాయుడు పాల్గొన్నారు

దేవస్థానం భూపరిరక్షణ విభాగం ఎస్‌డిసి బదిలీ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానం భూ పరిరక్షణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌రామలక్ష్మి బదిలీపై వెళ్లారు. గురువారం దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తిని కలిసి, విధుల నుంచి రిలీవ్ అయ్యారు. అనంతరం అప్పన్నను దర్శించుకున్నారు.

కుట్ర రాజకీయాలకు 'గంటా' స్వస్తి చెప్పాలి



మాట్లాడుతున్న తోట రాజీవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : కుట్ర రాజకీయాలకు ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వస్తి పలికి, వాస్తవాలు మాట్లాడాలని విశాఖ నవనిర్మాణ సమితి అధ్యక్షులు తోట రాజీవ్ హితవు పలికారు. గురువారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి జరుగుతుందని మూడు రాజధానులకు జై కొట్టిన గంటా, కపటప్రేమ నటిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం రాజీనామా నాటకమాడారన్నారు. టిక్కెట్ ఇచ్చిన పార్టీని అవమానపరుస్తూ, గెలిపించి ప్రజలను గాలికొదిలేసి, అండగా ఉన్న కేడర్‌ను అగౌరవ పరుస్తూ ఎపుడూ స్వార్థ రాజకీయాలే తప్ప, ప్రజాప్రయోజనాల కోసం ఎపుడూ పాటుపడలేదన్నారు. విడతకో నియోజకవర్గంలో పోటీచూస్తూ, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు ప్రస్తుతం ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లలో ఎన్నిసార్లు అసెంబ్లీకి వెళ్లారు, విశాఖ అభివృద్ధికి, నియోజకవర్గ ప్రజల కోసం ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. గంటాపై సిట్ ఇచ్చిన నివేదికని బహిర్గతం చేసి, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి

- స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించారని విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్ పేర్కొన్నారు. “11.11 లక్షల కోట్ల క్యాపెక్స్ (మూల ధన వ్యయం) వ్యయం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లు, ప్రధానమంత్రి గతి శక్తి కింద రైల్వే కారిడార్ కార్యక్రమం, ఉడాన్ పథకం కింద కొత్త విమానాశ్రయాల సమగ్ర అభివృద్ధి మొదలైన ప్రతిపాదనలు దేశీయ ఉక్కు పరిశ్రమ కెపాసిటీ వినియోగాన్ని మరింతగా మెరుగు పరుస్తాయని అభిప్రాయపడ్డారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డును పునర్నిర్మించాలి

- సిపిఎం ఆధ్వర్యాన రెండోరోజు కొనసాగిన సంతకాల సేకరణ

- మద్దతుగా నిలిచిన పలు పార్టీలు, సంఘాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే రహదారిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం రెండో రోజు కూడా కొనసాగింది. మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా టిడిపి, వైసిపి, జనసేన పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు. రహదారిని వెంటనే పునర్నిర్మించాలని వారు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ రోడ్డు శిథిలమై గోతులు పడి పలు ప్రమాదాలకు నిలయంగా మారిందని, ఈ మార్గంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలు వల్ల ప్రాణాలు పోవడంతో పాటు, కొంత మంది జీవితకాలం అంగవైకల్యంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే ప్రజా సహకారంతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శరగడం శివ బాబు నాయుడు, వైసిపి నాయకులు శరగడం జగ్గారావు, పోరాట నాయకులు ఆడారి రామకృష్ణ, కె.రామప్పలనాయుడు, సిపిఎం సీనియర్ నాయకులు కె.రామ సదాశివరావు, కర్రి అప్పారావు, ఎస్ కన్నం నాయుడు, బాబూరావు, రాంకుమార్, బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



మునగపాకలో సంతకాల సేకరణలో పాల్గొన్న ఆటో యూనియన్ నాయకులు

మునగపాక మెయిన్ రోడ్డులో...

మునగపాక : శిథిలమైన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు నిర్మాణం చేయాలని మునగపాక మెయిన్ రోడ్‌లో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. వాహనదారులు, పాదచారులు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. ఆటో యూనియన్ నాయకులు శిబిరం వద్దకు చేరుకొని సంతకాలు చేసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కాండ్రేగుల రామసదాశివరావు మాట్లాడుతూ ఈ మార్గం ప్రాణసంకటంగా మారినా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజాసంఘాలు, రైతు సంఘాలు పలు మార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అరణ్యరోదనగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, బుద్ధ రంగారావు, లోవేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు బలిరెడ్డి సూర్యనారాయణ, భాస్కరరావు, చంద్రశేఖర్ , చిన్న తదితరులు పాల్గొన్నారు.

శిథిల రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలి

అనకాపల్లి : శిథిలమైన అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మార్గంలో నాలుగు సంవత్సరాల నుండి అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేయడం తప్పితే పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రితో పాటు, ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నా వారిలో చలనం లేదని ఎద్దేవా చేశారు.



వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భరత్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని మోసయ్యపేట గ్రామంలో వైసిపి అనకాపల్లి నియజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్ కుమార్ పరిచయ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భరత్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రాను ఎన్నికల్లో వైసిపిని తిరిగి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్య నాయుడు, జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొలవిల్లి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, సర్పంచ్‌లు నిమ్మాదల సోమేశ్వరరావు, దుద్దేటి రాజేశ్వరి రమణ, నాయకులు ఇబి నాయుడు, గోకివాడ పోతురాజు, కొర్ని గంగరాజు పాల్గొన్నారు.



ఢిల్లీ బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్ అన్నారు. ఏపికి ప్రత్యేక హోదా కోరుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో శుక్రవారం ఢిల్లీలో జరిగే ధర్నాలో వందలాదిగా కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఢిల్లీకి వెళ్తున్న సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రులకు ప్రత్యేక హోదా ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిన మోడీ తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నేడు మోడీకి బానిసగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో షర్మిల నాయకత్వంలో ఢిల్లీలో మోడీ ప్రభుత్వానికి దిమ్మ తిరిగే విధంగా ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, తనకాల అనంతరావు, ఆడారి రమేష్ నాయుడు, షేక్ షఫీ, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు అప్రెంటిస్ విధానం సరికాదు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి రెండు సంవత్సరాల పాటు అప్రెంటిషిప్ విధానాన్ని ఉపాధ్యాయ వృత్తిలోకి తిరిగి అమలు చేయాలని జనవరి 31న జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించడం తిరోగామి చర్య అని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం అమలు లోనికి తెచ్చిన అప్రెంటిషిప్ విధానాన్ని 13 సంవత్సరాల ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి రద్దు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన కుమారుడు తిరిగి అదే విధానాన్ని అమల్లోకి తేవడం అన్యాయమన్నారు. అప్రెంటిషిప్ విధానం అనేది శ్రమ దోపిడీ తప్ప మరొకటి కాదన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు మొండి చెయ్యి చూపిస్తుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అప్రెంటిషిప్ విధానాన్ని విడనాడాలని కోరారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో డైట్ ఎంఒయు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాల ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గురుదేవ్ రవి శంకర్ స్థాపించిన 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' తో ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ ఎంఒయు కార్యక్రమం గురుదేవ్ రవి శంకర్ చేతులు మీదుగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా నిర్వహిస్తారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ ఈ ఎంఒయుతో డైట్ కళాశాల విద్యార్థులకు ప్రపంచస్థాయి నడవడికలను నేర్పిస్తామన్నారు. అసోసియేట్ డీన్ కృష్ణ నాగ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో అతి తక్కువ ఇంజినీరింగ్ విద్యా సంస్థలు ఈ ఎంఒయు తీసుకున్నాయని చెప్పారు. విద్యార్థులకు శ్వాస, ధ్యానం, యోగా కార్యక్రమాలలో శిక్షణ ఇచ్చి ఒత్తిడిని జయించేలా తీర్చిదిద్దుతారని ప్లేస్మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్ తెలిపారు.



ఎంఒయు అందుకుంటున్న రత్నాకర్ తదితరులు

వైసిపి హయాంలో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి- కె.కోటపాడు : వైసిపి ప్రభుత్వ హయాంలో మాడుగుల నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. కె.కోటపాడులో రూ.16 కోట్లతో చేపట్టిన 22 అభివృద్ధి పనులను గురువారం డిప్యూటీ సిఎం ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముత్యాల నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

డిఎస్‌సి పోస్టులు పెంచాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులు మాత్రమే భర్తీకి మంత్రిమండలి ఆమోదించడం సరికాదని, ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఉపాధ్యక్షులు అల్లు రాజు, జిల్లా కమిటీ సభ్యులు పాంగి చలపతి డిమాండ్ చేశారు. స్థానిక సిబిటియు కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి ఊరిస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ కోసం డివైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించిందని, మంత్రి బొత్స సత్యనారాయణ ఇళ్లు ముట్టడి, ఛలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి చేసిందని గుర్తు చేశారు. అయినా మెగా డీఎస్సీ ప్రకటించలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి 10 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, వారి ఆవేదనను దృష్టిలో పెట్టుకుని జూన్ వరకు రిటైర్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఎప్పుడో రద్దు చేసి రెండేళ్ల అప్రెంటిష్ షిప్ విధానాన్ని మళ్లీ తీసుకురావడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ

లీజు పేరుతో చెరువు గర్భం ఆక్రమణ

- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళన
- చుట్టూ కంచె వేసిన పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరంలో ఆర్టీసీ స్థలం లీజు పేరుతో చెరువు గర్భం ఆక్రమణకు గురవుతుందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. లీజుదారులు పాత చెరువులో ఆక్రమణలకు పాల్పడి కబ్జా చేస్తున్నారని పలు ప్రజాసంఘాలు రాజకీయ పార్టీలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గర్భాన్ని గ్రావెల్‌తో కప్పివేసి ఆక్రమణకు పాల్పడడానికి అధికారం ఎవరిచ్చారని స్థానిక పంచాయతీ అధికారులు ఆక్రమించిన స్థలంలో కంచె వేశారు.

చోడవరం సర్వే నెంబర్ 63లో 39 ఎకరాల 65 సెంట్లు విస్తీర్ణంలో పాత చెరువు గర్భం ఉండేది. దీనిలో 80బై సబ్ డివిజన్ చేసి మూడు ఎకరాల 71 సెంట్లు ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం కేటాయించారు. ఇందులో దేవాదాయ శాఖకు 20 సెంట్లు ఇచ్చారు. చెరువు గర్భాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఇస్తే ఆయకట్టుదారులకు నీరు ఎలా అందుతుందని అప్పట్లో అడ్డగించిన వారు కూడా ఉన్నారని కొందరు చెబుతున్నారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ వస్తే గ్రామం అభివృద్ధి అవుతుందని నాడు పంచాయతీ పెద్దలు ఈ స్థలాన్ని రాసిచ్చారు. నాడు 2 ఎకరాల 30 సెంట్లు భూమిలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. మిగతా భూమిలో 30 సెంట్లు ఇటీవల టెండర్ ద్వారా 15 సంవత్సరాల లీజుకు చోడవరంకు చెందిన కొందరు వ్యక్తులకు ఆర్టీసీ వారు ఇచ్చారు. దీంతో ఒక రాజకీయ పార్టీ, ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. చెరువు గర్భాన్ని ఆర్టీసీ లీజుకు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. అలాగే లీజు స్థలం కాకుండా మరో ఎకరా భూమి వరకు చెరువు భూమిని కబ్జా చేస్తున్నారని స్థానికులు అడ్డగించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి చెరువు పంచాయతీకి సంబంధించినది కావున చెరువు గర్భం 39 ఎకరాల 60 సెంట్లు తమకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు అర్జీ సమర్పించింది. దీంతో రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే జరిపి ఎవరి స్థలం ఎంతవరకు ఉందో అని తెలుస్తామని చెప్పడంతో ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగింది.


గ్రావెల్‌తో కప్పి వేస్తున్న చెరువు గర్భం

టిడిపి స్పందించకపోవడంతో అనుమానాలు

ఈ ఆక్రమణ వెనుక వైసిపి ప్రజా ప్రతినిధి ఉన్నారని జనసేన ఆందోళన చేపట్టింది. అయితే చోడవరంలో అత్యంత బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీ దీనిపై ఏ విధమైన స్పందన లేకపోవడంతో లీజుదారుల వెనుక ఆ పార్టీ నాయకులకు వాటాలు ఉన్నాయని చోడవరంలో చర్చించుకుంటున్నారు. చోడవరం నడిబొడ్డున సుమారు 100 కోట్ల రూపాయలు విలువ చేసే స్థలం లీజుకి తీసుకోవడం అంటే కోట్లాది రూపాయలు ఆదాయం పొందే అవకాశం ఉంది. కబ్జా వెనుక తమ పార్టీకి ఏమాత్రం ప్రమేయం లేదని, తానే చోడవరం పంచాయతీ అధికారులతో చెప్పి ఆక్రమణ జరగకుండా ఫెన్సింగ్ వేయించానని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. అడ్డగించిన వారికి ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ముట్టజెప్పి స్థలాన్ని కాచేయాలని లీజుదారులు యోచిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో చోడవరం పంచాయతీకి సంబంధించిన అనేక స్థలాలు ఈ విధంగానే పరులు సొంతమయ్యాయి. ఈ ఆందోళన కూడా ఆరంభ సూరత్వమేనని ఆఖరికి వచ్చేసరికి అందరూ రాజీమార్గం అవలంభిస్తారని స్థానికుల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముందు ఈ స్థల వివాదం రాజకీయ పార్టీలకు ప్రచారాస్త్రంగా మారనుంది.


విద్యార్థుల స్టడీని పరిశీలిస్తున్న ఎంఇఒ మూర్తి

టెన్త్ విద్యార్థుల రెమిడీయల్ టీచింగ్ పరిశీలన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల రెమిడీయల్ టీచింగ్‌ను స్థానిక ఎంఈఓ-2 బి.ఎస్.ఎన్ మూర్తి గురువారం పరిశీలించారు. ప్రార్థనా సమయంలో ఎనీమియాపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజన పథకంలో వంటలను పరిశీలించి రుచి చూశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ లెర్నింగ్ ఐఎఫ్‌పి వర్కింగ్ ట్యాబ్స్ వినియోగం మొదలైన అంశాలను పరిశీలించారు.

నేడు విద్యుత్తు అంతరాయం


ఎఇ శంకరరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ఏఈ కర్రి శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్తు అంతరాయానికి విద్యుత్తు వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

3న పిఎం విశ్వకర్మ పథకంపై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈనెల 3న అనకాపల్లి వివి రమణ రైతుభారతి ఆడిటోరియంలో సెమినార్-కమ్- అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశ సాంప్రదాయ చేతి వృత్తుల వారసత్వాన్ని సంరక్షించడానికి, ప్రోత్సహించడానికి, అధికారిక ఆర్థిక వ్యవస్థగా మారడం, గ్లోబల్ వాల్యూ చైన్స్‌లో విలీనం చేయడంలో కళాకారులకు సహాయం చేయడానికి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అనకాపల్లి, డిఆర్‌డిఏ, డిఎల్‌డిఓ, సిఎస్‌సి, డిపిఒ, ఏపీ ఎస్-ఎస్‌డిసి, ఎల్‌డిఎం, జిల్లా విలేజ్/ వార్డు సెక్రటేరియట్, ఎన్జీవో సంఘాలకు చెందిన నిపుణులు, టేక్ హోల్డర్స్ హస్త కళాకారుల సంఘాల వారు ఈ సదస్సులో పాల్గొంటున్నారని తెలిపారు. అధికారులు, సిబ్బంది, కళాకారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

వైసిపితో ఉత్తరాంధ్రకు ఒరిగింది శూన్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలకు ఒరిగింది ఏమీ లేదని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తానని చెబుతూ వచ్చిన జగన్‌రెడ్డి ఉత్తరాంధ్రకు ఏమి చేశారనేది సిద్ధం సభలో చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతానికి ఏమి చేశారో చెప్పడానికి మచ్చుకైనా ఒకటైనా ఉందా అని జగదీష్ ప్రశ్నించారు. ఉన్న ఫ్యాక్టరీలను తరిమివేసి కక్షలు కార్పణ్యాలతో ఉత్తరాంధ్రను సర్వనాశనం చేశారన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్ట్, భోగాపురం విమానాశ్రయం వంటివి ముందుకు సాగలేదన్నారు. విశాఖలో భారీ పెట్టుబడుల సదస్సు నిర్వహించిన కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా విశాఖకు ఒరిగింది ఏమీ లేదని పేర్కొన్నారు. రూ.500 కోట్లు పెట్టి జగన్ రెడ్డి కోసం రాజదర్బార్ లాంటి భవనాన్ని రుషికొండలో ఏర్పాటు చేసుకున్నాడని ఆరోపించారు.

పసలమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు సున్నం బట్టీలు గ్రామంలో ఈ నెల 4న జరగనున్న శ్రీపసలమ్మ తల్లి అమ్మవారి 29వ తీర్థ మహోత్సవం వాల్ పోస్టర్‌ను పిఏసిఎస్ చైర్మన్, శ్రీబంగారమ్మ తల్లి ఆలయ ధర్మకర్త కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న ఆదివారం ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు నుండి విశాఖపట్నం సూరజ్ ఈవెంట్స్ -హాట్ స్టెప్పర్స్ వారిచే డ్యాన్స్ మస్తీ మెగా డ్యాన్స్ షో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేవుడమ్మ, సచివాలయం కన్వీనర్ కాపుచెట్టి నీలమణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కూండ్రపువాని పాలెంలో గురువారం ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న జరుగు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం కృషి చేయాలని కోరారు. పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల నుండి రెండు లక్షల మందికి తక్కువ కాకుండా జన సమీకరణ చేయాలన్నారు. ఇందుకోసం ఇప్పటి నుండే పార్టీ కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సూచించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అనకాపల్లిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు క్లీన్ స్వీప్ చేయడానికి ఈ బహిరంగ సభ నాంది పలకాలన్నారు. కె.కోటపాడు మండలంలో చంద్రయ్యపేట, చౌడువాడ గ్రామాల్లో సభా స్థలిని నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యానారాయణ, కెఎస్ఎన్ఎస్.రాజు, గండి బాబ్జి, గవిరెడ్డి రామానాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నియోజకవర్గ ఇన్చార్జిలు పివిజి కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు, నాయకులు పైలా ప్రసాదరావు, దాడి రత్నాకర్, జనసేన నాయకులు పిఎస్ఎన్.రాజు, రాయపురెడ్డి కృష్ణ, కుంచా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్


ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వాసురాజు

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని మల్లవరం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ పి.వాసురాజు చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులతో ప్రజలు ఐదు లక్షల నుంచి 25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలో పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ గ్రామ అధ్యక్షులు చందక శివ, బత్తిన పెదరమణ, రమణ, సంజీవి, గ్రామ వాలంటరీ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని దోసూరు ఎస్సీ కాలనీకి చెందిన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న జల్లూరి తాతబాబుకు గురువారం జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎన్ కుమార్ చేతులమీదుగా పదివేల రూపాయలు పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గండి రాజు, జాగవరపు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల తహశీల్దారుగా పని చేస్తూ బదిలీ అయిన బి.సత్యనారాయణను జిల్లా విఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎస్.టి.రామకాసు, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఎన్ గంగాధర్ ఆధ్వర్యంలో విఆర్వోలు, డిటి వెంకట అప్పారావు, ఆర్ఐ వీరయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ ఉత్తమ సేవలందించి రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ తహసీల్దారుగా అవార్డు అందుకున్నారని తెలిపారు. వీఆర్ఏలు అప్పారావు, బాతు శ్రీను, వీఆర్వోలు మూర్తి, శేషగిరి, రవి, పాల్గొన్నారు.


సత్యనారాయణను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ) జిల్లా కోఆర్డినేటర్ ఎన్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిన స్థిర గౌరవ వేతనంపై పనిచేయుటకు ఈనెల 2 నుంచి 7వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఇంప్లిమెంట్ ఏజెన్సీ, ఎన్టీఆర్ హాస్పిటల్ గ్రౌండ్ ఫ్లోర్, మెయిన్ ఫార్మసీ స్టోర్స్ పక్కన అనకాపల్లి అడ్రస్‌కు స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపాలని సూచించారు. ఇతర సమాచారం కోసం జిల్లా కోఆర్డినేటర్ 812162299 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పరికరాలు సరఫరాకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి : జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో పరికరాల కొనుగోలు, సరఫరాకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ జిల్లా కోఆర్డినేటర్ ఎన్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను Anakapalli.ap.gov.in ద్వారా డౌన్లోడ్ చేసుకుని, ఈనెల 6వ తేదీలోగా కార్యాలయ పని వేళల్లో అందజేయాలని కోరారు. మరింత సమాచారం కోసం జిల్లా కోఆర్డినేటర్, ఐఆర్‌సిసి అనకాపల్లి, ఫోన్ నెంబర్ 8121622999కు సంప్రదించాలని కోరారు.

ప్రజల పక్షాన సిపిఎం పోరాటం

-పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లోకనాథం, పలు చోట్ల విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న లోకనాథం, నాయకులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల కేంద్రంలో సిపిఎం రాష్ట్ర పిలుపులో భాగంగా మెయిన్ రోడ్డు, ఇంటింటా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, ఆర్.శంకర్‌రావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సిపిఎంకు ఆర్థిక విరాళం ఇవ్వాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సిపిఎంకి అండగా నిలవాలన్నారు. రానున్న కాలంలో ప్రజల పక్షాన ఉద్యమాలు చేయాలంటే ప్రజల నుండి ఆర్థిక విరాళ సేకరణ చేయాలని సంకల్పించామని లోకనాథం పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి. టిడిపి జనసేన. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మద్దతుతో అనుకూలంగా ఉన్నారని దుయ్యబట్టారు. సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు గోవిందరావు మాట్లాడుతూ, రావికమతం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లీజ్ రద్దు చేయాలని. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. దీనికి స్థానిక ప్రజలు అండగా ఉండాలని కోరారు.. ఈ కార్యక్రమంలో కొమిరి, కవ్వ కుంట, చీమలపాడు, జెడ్.బెన్నవరం, గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపె సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఎన్నడు లేని విదంగా దేశంలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు రాజకీయ ప్రయోజనాలకు తలొగ్గి బిజెపితో రాజీ పడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి రావలసిన విభజన హామీలు కేంద్రం విస్మరిస్తే అడగలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, టి.ఈశ్వరరావు, శివ, నాగమణి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట తదితర పోలింగ్ కేంద్రాలను కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునే విధంగా సహకరించాలని వీఆర్వో, గ్రామ పెద్దలకు సూచించారు. ఎన్నికలు సజావుగా సాగించేందుకు అందరి సహకారం తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సిఐ

అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డిఎన్.రత్నకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈస్ట్ గోదావరి జిల్లా నుండి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, సర్పంచులు, ఎంపిటిసిలు సహకారంతో ముందుకు వెళ్తానని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒగా పని చేసిన డేవిడ్‌రాజు తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడుకు బదిలీ అయ్యారు.

పద్మనాభం: స్థానిక ఎంపిడిఒగా బి శైలజ గురువారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో పనిచేస్తున్న ఆమెకు పద్మనాభంలోపోస్టింగ్ ఇవ్వగా, ఈమేరకు విధుల్లో చేరారు.

ఆనందపురం: ఆనందపురం ఎంపిడిఒగా ఎన్.అప్పలనాయుడు గురువారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా, భోగాపురంలో ఎంపిడిఒగా పనిచేసిన ఆయనను ఇటీవల ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆనందపురంలో నియమించారు.

కశింకోట : కశింకోట ఎంపిడిఓ కె.శేషు బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పని చేసిన వివి. రవికుమార్ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలానికి బదిలీ అయ్యారు.

సబ్బవరం:సబ్బవరం ఎంపీడీఓగా ఎస్.రామ్మోహనరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం రూరల్ మండలం నుండి బదిలిపై వచ్చిన ఆయన ఎఒ యస్‌కె.బాబూరావు నుండి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఇఒపిఆర్‌డి మహేష్, ఎఒ షేక్ బాబురావు, కార్యదర్శులు కె.మూర్తి బాబు, బ్రహ్మ, మహాలక్ష్మి నాయుడు సత్కరించారు.


చోడవరం : చోడవరం తహశీల్దారుగా పి.వేణుగోపాలరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా సిగిడం మండలం నుండి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బి.తిరుమల బాబు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

టౌన్ సిఐగా కాంతికుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం టౌన్ సిఐగా త్రిపురాన కాంతికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఐ నమ్మి గణేష్ నుండి ఆయన బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్ కు చెందిన ఆయన విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గంజాయి, నాటుసారా వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

తహశీల్దార్ వరహాలు బదిలీ

ప్రజాశక్తి-రోలుగుంట:ఎన్నికల బదిలీల్లో భాగంగా రోలుగుంట తహశీల్దార్ కె.వరహాలు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది జూన్ నెలలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధుల్లో చేరిన వరహాలు ఇక్కడే తహశీల్దార్‌గా పదోన్నతి లభించింది.



తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల తహశీ ల్దార్ విజయ కుమార్ బదిలీ కావడంతో మండల రెవిన్యూ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలానికి బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్యాంకుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి గురుకులంలో ఇంగ్లీష్ మాధ్యమంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం 2024-25 విద్యా సంవత్సరమునకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె ఎస్ ఆర్ కుమారి ప్రకటనలో తెలిపారు.అర్హులైన వారు 23-02-2024 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఎస్.సి / ఎస్.టి విద్యార్థులు 1.9.2011 నుండి 31.8.2015 మధ్య, ఓసి, బి.సి, ఎస్.సి కన్వెర్టెడ్ క్రిస్టియన్ (బి.సి.సి) విద్యార్థులు 1.9.2013 నుండి 31.8.2015 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా చదువు పూర్తి చేసి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఒక లక్ష రూపాయలకు మించి ఉండరాదు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్స ప్రవేశాలకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు 2023- 24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. 31-8-2024 నాటికి విద్యార్థుల వయసు 17 సంవత్సరములు దాటరాదు. విద్యార్థులు మీ సేవ /నేట్ సెంటర్ లేదా గురుకులంను సంప్రదించి ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫోటో, స్టడీ సర్టిఫికేట్లతో ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకొవాలని వివరాలకు ఫోన్ నెంబర్లు 7995601141, 7901333569 సంప్రదించాలన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష 5 వ తరగతికి ఉదయం 10 నుండి 12.00 గంటల వరకు, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరము మధ్యాహ్నం 2గంటల నుండి 4.30 గంటల వరకు ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సహాయ సంచాలకు

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో పశువులు కలిగిన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలకు దరఖాస్తులు సేకరించి సంబంధిత బ్యాంకులకు వెంటనే పంపించాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆదేశించారు. గురువారం చీడికాడ పశు వైద్య కార్యాలయంలో డాక్టర్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా లబ్ధి పొందుతున్న 18 నుంచి 75 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులు అర్హులన్నారు. పాడి రైతులు 2 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డ్ జెరాక్స్, బ్యాంక్ అక్కౌంట్ జెరాక్స్, పశు ఆరోగ్య హెల్త్ కార్డు జెరాక్స్‌లను తీసుకొని రైతు భరోసా కేంద్రంలోని పశు వైద్య సహాయకులకు అందించాలన్నారు. ఈ పథకం కింద మంజూరయ్యే సొమ్ముతో దాణా, పశుగ్రాస పెంపకం, ఇతర యాజమాన్య ఖర్చులకు ఉపయోగించుకోవచ్చునన్నారు. ఈ పథకంలో భాగంగా రైతులు 7శాతం వడ్డీ చెల్లించవలసి ఉంటుందని సక్రమంగా చెల్లిస్తే వడ్డీలో 6శాతం రాయితీ తిరిగి రైతులకు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో పశు వైద్యాధికారులు గాయత్రి, గణేష్, రాఘవమ్మ, పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



నగదు బహుమతిని అందజేస్తున్న నాయకులు

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి-చీడికాడ:మండల కేంద్రంలో గురువారం ఆంజనేయ స్వామి తీర్థ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయ కమిటీ, చైర్మన్ జి రవిరాజు, ప్రజలు ఆలయంలో పూజలు నిర్వహించారు. తీర్థ మహెూత్సవం సందర్భంగా ముగ్గుల, బైక్ స్లో, భజన పోటీలు నిర్వహించారు అనంతరం విజేతలకు బహుమతులు జనసేన పార్టీ నాయకుల ప్రోత్సాహంతో అందజేశారు. సాయంత్రం మహిళల కోలాటం, మెగా డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, యుటిఎఫ్ నేతలు

టెన్త్ మోడల్ ప్రశ్నాపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాయకరావుపేట : మండలంలో ఎస్ నరసాపురం పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ మోడల్ నమూనా పేపర్లను హెచ్‌ఎం ఝాన్సీ, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాజేష్, ప్రభాకర్ విడుదల చేశారు.ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ ఎం.రమణ, సహాయ కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ, విద్యార్థులకు పోటీ పరీక్షలు కోసం ప్రతి సంవత్సరం మోడల్ నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలను ఎస్ఎఫ్ఐ గా చేపడుతుందన్నారు.యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాజేష్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఎటువంటి పోటీ పరీక్షలు ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, 500 మంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో కలిసి మాట్లాడుతున్న అప్పలరాజు

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. మండలంలోని గునుపూడి గ్రామంలో గురువారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని తీవ్ర కరువు నెలకొని ఉందని, దీంతో కూలీలకు చేయడానికి పనులు లేక పస్తులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి, కూలీలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని మండలంలో అన్ని గ్రామాల్లోనూ పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గునిపూడి మాజీ సర్పంచ్ మాసా జోగారావు, వాతాడ అప్పారావు, మాసా యేసుబాబు, పల్లా అప్పారావు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న హౌసింగ్ సొసైటీ సభ్యులు

త్వరితగతిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ త్వరితగతిన జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున వెల్లడించారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తుందని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గానికి ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్‌లో భాగంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం గురువారం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లిఖార్జున మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుల ప్రాథమిక వెరిఫికేషన్ పూర్తయ్యిందని చెప్పారు. అర్హత గల ప్రతి జర్నలిస్టుకూ న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందే ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం సొసైటీ కార్యవర్గ సభ్యులు నూతనంగా భాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలసి వీలైనంత వేగంగా స్థలాన్ని ఫైనలైజ్ చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షులు జి. జనార్ధనరావు,అధ్యక్షులు బి.రవికాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పిఎ.రావు, బొప్పన రమేష్, సహాయ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బందరు శివప్రసాద్, ఎం.చిట్టిబాబు, అనురాధ, సీనియర్ జర్నలిస్టు శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో టిడిపి విశాఖ రూరల్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్ట గుల్లి సుబ్బారావు అధ్యక్షతలో సోలభం, గడుతురు, పెదలోచల పంచాయతీ గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించారు. గ్రామ ప్రజల్ని ఉద్దేశిస్తూ సుబ్బారావు మాట్లాడుతూ, బ జగన్ ప్రభుత్వం అరుకు పార్లమెంట్ కాన్స్టిటూ్యషన్లో సుమారుగా 50వేల పెన్షన్లు తీసేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో వైయస్ఆర్సీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సర్పంచులకు, వార్డు మెంబర్లను కీలుబొమ్మలుగా చేశారన్నారు.

తహశీల్దార్లకు పోస్టింగ్‌లు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాకు కేటాయించిన 25 మంది తహశీల్దార్లకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేశారు. జూన్ 30వ తేదీలోపు ఉద్యోగ విరమణచేయనున్న నలుగురు తహశీల్దార్లను జిల్లాలో సర్దుబాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లు పూర్తయిన, ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన తహశీల్దార్లను ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కేటాయిస్తూ బుధవారం సిసిఎల్ఎ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన వారి స్థానంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేస్తున్న తహశీల్దార్లను జిల్లాకు కేటాయించింది. జిల్లాకు వచ్చిన తహశీల్దార్లకు కేటాయించిన పోస్టింగ్ వివరాలు ఇవి.

పేరు	పోస్టింగ్ స్థలం
1.బి.రాజేశ్వరరావు	కలెక్టరేట్, పరిపాలన విభాగ సూపరింటెండెంట్
2.ఎంఎ శ్రీనివాస్	కలెక్టరేట్, మెజిస్టీరియల్ సూపరింటెండెంట్
3.బి.సత్యనారాయణ	కలెక్టరేట్, భూ విభాగ సూపరింటెండెంట్
4.డి.రామమూర్తి	కలెక్టరేట్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్
5.గంగాధరరావు	అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం, డిఎఒ
6.వి.ప్రకాశరావు	నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం డిఎఒ
7.కె.శ్రీనివాసరావు	అనకాపల్లి
8.పి.సరోజిని	అచ్యుతాపురం
9.కె.శ్రీకాంత్	బుచ్చెయ్యపేట
10.పి.వేణుగోపాలరావు	చోడవరం
11.జి.లక్ష్మీనారాయణ	దేవరాపల్లి
12.ఆర్.అప్పలరాజు	యలమంచిలి
13.జె.ఈశ్వరమ్మ	కె.కోటపాడు
14.ఎల్.మధుసూధన	కశింకోట
15.బి.పాపారావు	మునగపాక
16.ఎస్.గణపతిరావు	పరవాడ
17.బి.అప్పలస్వామి	రాంబిల్లి
18.జె.చలమయ్య	సబ్బవరం
19.బి.ప్రకాశరావు	చీడికాడ
20.జి.ప్రభాకరరాజు	గొలుగొండ
21.బి.వెంకటరమణ	కోటవురట్ల
22.బి.మురళీమోహనరావు	మాకవరపాలెం
23.ఎం.శ్రీకాంత్	నక్కపల్లి
24.ఎన్.రమేష్‌కుమార్	నాతవరం
25.ఎ.శ్రీరాములు	నర్సీపట్నం
26.జిఎ సూర్యనారాయణ	పాయకరావుపేట
27.ఎస్.రమణరావు	రావికమతం
28.కె.రవిచంద్ర	రోలుగుంట
29.టి.సత్యనారాయణ	వి.మాడుగుల



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

డిఎస్‌సి పేరుతో నిరుద్యోగులకు మోసం

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల సమయంలో డిఎస్‌సి పేరుతో నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మెగా డిఎస్‌సి ఇస్తామని చెప్పి మరో మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సమయంలో హడావిడి చేస్తున్నారని విమర్శించారు. 2019 సాధారణ ఎన్నికల ముందు రాష్ట్రంలో 2.30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయ పోస్టులు 23 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని తాను అధికారంలోకి వస్తే ఈ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వటం మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ భర్తీలో కూడా అప్రంటీస్‌షిప్ తీసుకురావాలని చూస్తున్నారన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. రాబోవు సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన ఛాంబరులో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, త్వరలో సాధారణ ఎన్నికలు రాబోతున్నాయని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా, వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

యుటిఎఫ్ రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని ఐటీడీఏ కార్యాలయం ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రిలే దీక్షలు చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన దీక్షలను ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఎన్నో సార్లు వినతులు ఇచ్చినా పెడచెవినపెడుతుందన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

-మరమ్మతుకు నోచని కల్వర్టులు

ప్రజాశక్తి- కోటవురట్ల: కొడవటిపూడి శివారు గిరిజన గ్రామం కోదండరామపురం రోడ్డు నిర్మాణం గడిచిన నాలుగైదు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచి పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేపట్టి నిలిపి వేయడంతో నడకదారి సైతం సక్రమంగా లేక గ్రామస్తులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.



బీటలు బారిన కల్వర్టు



రాళ్లు తేలిన రహదారి

రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం అనే ప్రచారమే తప్ప గిరిజన గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు సందర్శించిన సందర్భాలు లేవు. రహదారి మార్గంలో నిర్మించిన కల్వర్టులు నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో పలుచోట్ల పగుళ్లు ఇచ్చాయి. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు రేషన్ సరుకులకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టి గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.